# రెండు రూపాలు

భూషణరావు ఒక ముఖ్య విషయం పద్మావతిని అడుగుదామని వచ్చాడు. ఆమె ఇల్లు మారిందని తెలిసింది. క్రొత్త వీథి, సందు మొదట్లో కాస్సేపు నిల్చొని ఓ ముగ్గుర్ని అడిగితే పద్మావతి ఎవరో వాళ్ళకు తెలియదన్నారు. అంత మంచి వాతావరణంలో మూడు గదుల ఇంట్లో ఉన్నది, ఈ సందులో పాకల మధ్య ఎందుకుంటుంది? ఎలా ఉండగలుగుతుంది? ఎందుకైనా మంచిదని ఆ సందులో ఉన్న చిన్న కిళ్ళీబడ్డీవాడిని అడిగాడు. వాడు వివరాలు విని "తిన్నగా వెళ్ళి - అదుగో ఆ చెత్తకుండీ ఉందే - ఆ కుడివైపు సందులో, సివరి పెంకుటిల్లు" అన్నాడు.

ఇద్దరు మనుషులు కదలడానికి సరిపడే సందు. ఇటూ అటూ కుళ్ళు కాలవలు, తను రిటైరైనా ఇల్లు మారలేదు. పద్మావతి సర్వీసులో ఉండే ఈ మారుమూల కెందుకు చేరిందన్న సంశయం అతనికి కలిగింది. ఇదీ ఒక పాకే. ఎవరో కొనుక్కుని పెంకు వేయించినట్లుంది.

తలుపు తట్టాడు. కొంత సేపయ్యాక తలుపు మెల్లగా తెరిచింది.

ఆశ్చర్యంతో "మీరా? రండి...." నమస్కారం చేస్తూ పద్మావతి లోనికి ఆహ్వానించింది.

మంచంమీద కాస్త మూలుగుతూనే గోడకు చేరబడి కూర్చుంది. ఒకే గది. పెరట. చిన్న వరండాలో వంట.

ఈమెను ఎవరైనా మోసం చేశారా? మానసికంగా గాయపడిందా? అదేదో వివరంగా తెలుసుకుంటేనేగానీ తన విషయం ప్రస్తావించలేదు. ముందు ఈమె ఆరోగ్యం కుదుటపడాలి. ఆమె నోట శక్తినిచ్చేదేదో పోయాలి అడిగితే 'మీకెందుకు శ్రమ' అంటుంది. లేచి వరండాలోకి వెళ్ళాడు. అక్కడే ఉన్న 'స్టౌ' వెలిగించాడు. ఆమె వద్దనలేదు. వేడి హార్లిక్స్ కడుపులో పడ్డాక ఆమెకు చెమట పట్టింది.

"ఏమిటి జబ్బు? జ్వరమేనా?" అడిగాడు.

జవాబుగా పేలవంగా నవ్వగానే ఆమె సహజంగా కనిపించింది. ఆఫీసులో పనిచేసే యాభైమందిలో ప్రతిరోజూ ఇద్దరి గురించి మిగతా వాళ్ళు ఏదో ఒక క్షణాన మాట్లాడుకునేవారు. ఒకరు పద్మావతి అయితే రెండో వ్యక్తి భూషణరావు.

పద్మావతికి పెళ్ళి కాలేదు. భూషణరావుకు పెళ్ళయింది. ఇద్దరు కొడుకులు కూడా ఉన్నారు. పద్మావతి ఆఫీసులో చేరేసరికి సన్నగా ఉండేది. అప్పటికి ఆఫీసులో అమ్మాయి ఆమె ఒక్కర్తే! ఆమె విసుగు పడేది కాదు. ఎవరైనా ప్రేమరాగాన్ని కూనిరాగంగా తీసినా నవ్వేసేది.

ఈ నవ్వును చూసి నాలుగు విధాల అర్థం చేసుకునే వాళ్ళు లేకపోలేదు. 'నవ్వగలిగిన వారిని నమ్మాలిరా' అని ఒక బ్రహ్మచారి అంటే, పెళ్ళయినవాడు "జాగ్రత్తరా! నవ్వుతూ నీ ముక్కుకు తాడుగట్టి లాగేగల"దని చమత్కరించాడు. ఇంకొతడు పెదాలు చప్పరిస్తూనే "నవ్వుల తోటలో నాగులు తిరుగుతాయన్న సామెత ఉందిరా బాబ్జీ!" అని వార్నింగ్ ఇచ్చాడు.

భూషణరావు హోదాతో బొగ్గు ఇంజనులా అరుస్తుంటే "అదిగో, ఏడుస్తున్నాడు. ఏడ్చే మగాణ్ణి నమ్మరా"దని అతనికింద పనిచేసేవాళ్లు కొందరు తిట్టారు. మరికొందరు లోనే ఏడ్చుకున్నారు. పద్మావతి అతని కేకలను నవ్వుతూ స్వీకరించేది.

అలాంటి 'చండశాసనుడ'ని పేరుపడ్డ భూషణరావు తన ఇల్లు వెతుక్కుని వచ్చాడెందుకో? 'చెప్పండి' అన్నట్లు చూసింది.

"నర్సింగ్‌హోంలో చేర్పిస్తాను పద" అన్నాడు భూషణరావు. పద్మావతి మౌనం దాలిస్తే, "మీ వాళ్ళంతా ఉండగానే నేనెవర్ని నర్సింగ్‌హోంలో చేర్పించడానికి అని అనదలచావా? నా మాట వెక్కిరించినట్లుంటే చెప్పు - వెళ్ళిపోతాను" అని లేచాడు.

"మీ రెందుకొచ్చారో ముందు చెప్పండి" అని మెల్లగా పద్మావతి అడిగింది.

"ముందు నువ్వు తేరుకో. శక్తి వచ్చాక నీ ముక్కు కోసిన కబురు చెప్తాను. అప్పుడైనా నీకు కోపం రాదా?" అని- "డాక్టరును తేగలను. ఇక్కడ నీ సేవ చేసేవాళ్ళెవరూ లేరు. అందుకే నర్సింగ్‌హోం అన్నాను'' అన్నాడు.

''అంత డబ్బు....'' అని తల దించింది పద్మావతి.

''అప్పు అనుకుని అంచెలుగా నాకు తీర్చేయ్.''

పద్మావతి అంగీకరించింది. నర్సింగ్‌హోమ్‌లో రోజూ సాయంత్రం కాస్సేపు ఆమె దగ్గర గడిపేవాడు. ఒకరోజు పద్మావతి ఆఫీసునుంచి ఆమెను చూడడానికి వచ్చిన నలుగురూ అక్కడే ఉన్న భూషణరావును చూసి విధిలేక వంగి సలాములు చేసి వెళ్ళారు.

''ఆ నలుగురూ ఒకనాడు నీ నవ్వును చూసి నిన్ను పెళ్ళాడదామనుకున్న వాళ్ళే'' అన్నాడు భూషణరావు.

''నావరకూ రాని విషయం మీకెలా తెలుసు?'' అడిగింది పద్మావతి.

''వీళ్ళే కొత్త అమ్మాయిలు చేరాక నిన్ను 'ఆంటీ'ని చేసేశారు.''

''నిజమా?''

''అవును మరి. నువ్వు వయసులోనూ...శరీరంలోనూ పెరిగావుకదా!''

''మీరేదో కేకలు వేస్తారుగాని, ఇలాంటి విషయాల్లో ఆసక్తి చూపించరనుకున్నాను.''

''నీగురించి విన్నది చెప్పాను. నా గురించి నువ్వేం విన్నావో చెప్పు.'' అడిగాడు భూషణరావు.

''ఇంట్లో మిమ్మల్ని హడలు కొట్టేస్తుంటే వాళ్ళనేం చేయలేక ఆఫీసులో మీక్రింద పనిచేసే వాళ్ళమీద విరుచుకుపడుతున్నారని....''

''ఇంకా....''

''ఒకోసారి మిమ్మల్ని....మిమ్మల్ని....''

''మొహమాటపడకు - పిచ్చి వెధవ అనేవారుకదూ? వాళ్ళ మాటకేంగానీ నువ్వూ అలానే అనుకున్నావా?''

''మీరు వాళ్ళకు ఒక రూపంతోనే కనిపించారు. నాకు మీ రెండో రూపం కనిపించేది.''

"అందుకే నేనేమన్నా నవ్వేదానివా?''

పద్మావతి నవ్వేసింది.

''రేపు డిశ్చార్జి చేస్తారు. నీ ఇంటికి వెళ్తావా? నా ఇంటికి వస్తావా?'' లేచి పోతూ అడిగాడు.

ఆమె ఆశ్చర్యంతో ఏదీ తేల్చుకోలేకపోయింది.

''ఆలోచించి రేపు చెప్పు'' అని వెళ్ళిపోయాడు.

ఆ మరుసటిరోజు ''మీ ఇష్టం" అనేసింది. తిన్నగా తన ఇంటికి తీసుకు వెళ్ళాడు. ఇంట్లో తనూ, ఒక ముసలి వంట మనిషే ఉన్నారు. అన్ని హంగులున్న ఒక గది ఆమెకు ప్రత్యేకించబడింది. అందులో కాలు పెట్టి కలయజూసి–

''మీకేం మేలు చేశానని నామీద ఇంత శ్రద్ధ తీసుకుంటున్నారు?'' అని అడిగింది.

''ముందు కూర్చో'' అని సోఫా చూపించాడు. ఆమె ఎదురుగా కూర్చొని–

''నువ్వెప్పుడూ నాకు నిజరూపంతో కనిపించేదానివి'' అన్నాడు.

''మీ ఆవిడది నటనా స్వరూపమా?''

''ఏ బరువూ ఎవరూ ఆమె నెత్తిన ఎత్తలేదు. అణిచేస్తున్నానని ఎప్పుడూ విసవిసలాడుతుండేది. సరదాకైనా నవ్వలేదు. ఇంట్లో లేని నవ్వును ఆఫీసులో నీ ముఖంలో చూడగానే ప్రాణం వచ్చేది.''

''నాది నిజ రూపం అని ఎలా నిర్ధారించుకున్నారు?''

"నీ తల్లిదండ్రులు పిల్లల మందను సృష్టించారు. నీ తరువాత, వాళ్ళందరూ వచ్చారని వాళ్ళకోసం పెళ్ళి కూడా చేసుకోలేదు. వాళ్ళందరికీ ఆ పెద్ద చదువులు, పెళ్ళిళ్ళు - ఈ బాధ్యతలన్నీ నీమీద వేసుకున్నావు. ఇది నిజ రూపం కాక మరేమిటీ?"

''నిజ రూపంతో బ్రతకడం చాలా కష్టం.'' పద్మావతి అంది వణికే స్వరంతో.

"నిజమే! నేనూ నిజ రూపంతో నా పెళ్ళాం దగ్గర ఉండడానికి ప్రయత్నించాను. అదేకాదు, నా ఇద్దరు కొడుకులూ నన్ను అసహ్యించుకునేటట్లు చేసింది. తలుచుకుని ఆనందించడానికి ఏం మిగిల్చి చచ్చింది?"

''నాకు మాత్రం ఏం మిగిలింది?''

''ఏం మిగల్లేదా?''

''నిందలూ .... అప్పులూ."

''ఏలాంటి నిందలు?''

''అమ్మ ఉన్నప్పుడు ఆసరా ఉండేది. నేను పెళ్ళి చేసుకోకపోవడానికి నేనే కారణమని అంటున్నారు. వాళ్ళ తెలివితేటలే వాళ్ళకు అంత మంచి ఉద్యోగాలిచ్చాయని తమ్ముళ్ళు అంటున్నారు. మా నాన్నకు కొడుకుల దగ్గర ఉంటేనే సుఖమట! వాళ్ళ చేతులమీద పోతే విముక్తి వస్తుందట అడది ఒక్కత్తే ఉండకూడదు. ఉద్యోగం వదిలేసి నన్ను వాళ్ళ దగ్గరకు వచ్చేయమంటున్నారు.

రానన్నానని ఇల్లు ఖాళీ చేశారు. ఈ చిన్న ఇంట్లో ఉండి అప్పులు తీర్చు కుందామని...."

"ఆనాడు, నీ ఇల్లు వెతుక్కుని ఎందుకొచ్చానో తెలుసా?"

"నన్ను నర్సింగ్‌హోంలో చేర్పించడానికేమో?"

''ఆనాడు నీరసంగా ఉన్నావు, అడగలేకపోయాను.''

''ఇప్పుడు నీరసంగా లేనుగా? అడగండి.''

''ఇన్నాళ్ళు నేను నా పెళ్ళాం రాటుపోటులతో నువ్వన్న రెండు రూపాల తోనే బ్రతికాను. ఎందుకిలా బ్రతికానని బాధపడుతున్నాను. కనీసం ఇక మిగిలిన బ్రతుకైనా నిజ రూపంతో బ్రతకాలని ఉంది. మంత్రోపదేశానికి గురువు ఎలా అవసరమో, నిజ రూపంతో బ్రతకడానికి శిక్షణ, అలా నిజరూపంతో బ్రతికే పుణ్యమూర్తులే ఇవ్వాలి. అదెవరని ఆలోచిస్తే ని నవ్వు జ్ఞప్తికి వచ్చింది నీకెంతో ఋణపడి ఉన్నాననిపించి, నీ ఇంటికి బయలుదేర్నాను."

''నర్సింగ్‌హోంలో చేర్పించి ఋణం తీర్చేశారుగా!''

''మరి మంత్రోపదేశం మాటేమిటి?''

"నాకే మంత్రాలు రావు బాబూ!''

''అసలు మంత్రం వచ్చు - అదే - ప్రేమించడం!''

''ఈ వయసులోనా?''

''ప్రేమించకపోతే ఆ బరువంతా మొయ్యగలిగేదానివా? అలా నవ్వ గలిగేదానివా? చెప్పమన్నావు కాబట్టి చెప్తున్నాను - ఆనాడు నన్ను పెళ్ళాడ్డానికి ఒప్పుకుంటావా అని అడుగుదామని వచ్చాను."

కాస్సేపు మౌనం తరువాత ''నేను ఓ నిర్ణయం తీసుకోడానికి ఒక వారం రోజులు ఆగండి" అంటూ వెళ్ళిపోడానికి లేచింది.

అనుకోని సమాధానం వినగానే భూషణరావు ఒక్కసారి చెంపపెట్టు తిన్నట్లు ముఖం పెట్టాడు. అయినా వెంటపడి "అయితే వచ్చే శనివారం సాయంత్రం రమ్మంటావా?'' అడిగాడు.

''మీరు రావద్దు ఏ విషయం నేనే తెలియజేస్తాను'' అని తన ఇంటికి వెళ్ళిపోయింది.

ఆ శనివారం నాటికే పద్మావతి దగ్గర నుంచి ఉత్తరం వచ్చింది. ఆత్రతతో విప్పాడు.

''మిమ్మల్ని అంతగా ప్రభావితం చేసిన నా నవ్వు నా బయటి స్వరూపం. మీ దగ్గర నుంచి వచ్చాక నాలో ఉన్న రెండోరూపం కనిపించింది.

ఈ రూపానికి, మీ చనిపోయిన భార్య రూపానికి ఎటువంటి తేడా లేదు. ఇద్దరిదీ, ఒకే వ్యక్తిత్వంతో బ్రతకాలని ఆరాటపడ్డ రూపాలే - ఇదే అసలైన రూపం. నన్ను బానిసను చెయ్యాలని ప్రయత్నించిన మా నాన్ననే ఎదిరించాను. మిమ్మల్ని కట్టుకున్నా అదేపని చేస్తాను. రత్నాల్లాంటి బిడ్డలను ప్రసాదించిన మీ భార్య వ్యక్తిత్వాన్ని గౌరవించలేని మీరు, ఏమీ ఇవ్వలేని నన్నెలా భరించ గలరు?

క్షమించండి.

*

పద్మావతి.''

(1989)